'108' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

108 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు కొత్తూరులో విలేకరులతో మాట్లాడారు. టిడిపి కూటమి అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడడంలో అంబులెన్స్ ఉద్యోగుల పాత్ర ఎనలేనిదని గుర్తు చేశారు. సిబ్బంది న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలన్నారు. డిమాండ్ల పరిష్కారానికి 108 ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలన్నారు.

'పది' విద్యార్థులకు మాధ్యమం పాట్లు

- తలలు పట్టుకుంటున్న హెచ్‌ఎంలు
- ఫీజుల చెల్లింపులో గందరగోళం
- నేడు పిడిఎఫ్ ఎమ్మెల్సీలను కలవనున్న నాయకులు

ప్రజాశక్తి- టెక్కలి

విద్యారంగంలో వినూత్న మార్పులు చేస్తూ... విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమం చదువులు పేరుతో గత ప్రభుత్వం సంస్కరణలను తీసుకొచ్చింది. దీంతో ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు గుదిబండగా మారుతుంది. మాద్యమం ఎంపిక ప్రక్రియ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తలనొప్పి వ్యవహారంగా మారుతుండగా... ప్రస్తుతం పదో తరగతి పరీక్షల ఫీజుల చెల్లింపులో గందరగోళ పరిస్థితి నెలకుంది. దీంతో ఏమి చేయాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో ఉపాధ్యాయులు, పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. సమస్య పరిష్కారానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అలాగే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు సంఘ నాయకులు సమాయత్తమవుతున్నారు. గడచిన నాలుగేళ్ల క్రితం విద్యా సంస్కరణలో భాగంగా గత ప్రభుత్వం ఒకే మీడియం చదువులు పేరుతో ఆదేశాలు జారీ చేసింది. మాద్యమాన్ని ఎంచుకునే అవకాశం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇవ్వకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని విద్యార్థులపై మాద్యమాన్ని రుద్దారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పాఠశాలలన్నీ ఆంగ్ల మాధ్యమంగా మర్చుతున్నామని ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. దీంతో నాలుగేళ్ల క్రితం ఆంగ్ల మాధ్యమంతో పరిచయం లేని విద్యార్థులంతా ఆరో తరగతిలో చేరారు. వీరంతా ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నారు. వీరికి ఈ ఏడాది ఫీజులు చెల్లించే క్రమంలో వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే మీడియం అని అడగడంతో ప్రధానోపాధ్యాయులు సతమతమవుతున్నారు. ఇదే విషయాన్ని సంబంధిత ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లగా... తప్పనిసరిగ్గా ఆంగ్ల మాధ్యమం ఉండాలని చెప్పడంతో అవాక్కయిపోయారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ ఆంగ్ల మాధ్యమంలోనే చదవాలని ఆదేశించిన ఉన్నతస్థాయి అధికారులు విద్యార్థులకు అందించే ఉచిత పుస్తకాలను రెండు మాధ్యమాల ద్వారా ఎందుకు పంపిణీ చేశారని సంఘ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

కాగా, ఒక పక్క జాతీయ విద్యా మండలి సుప్రీం కోర్టు వంటి న్యాయస్థాం విద్యార్థుల అభీష్టం మేరకు ఆయా మాధ్యమంలో బోధన చేయాలని, ఏ రాష్ట్రం ఆ భాషని గౌరవించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులు, చదివే విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలోనే చదువులు, బోధన ఉండాలని చెప్పడంతో ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారులు చేసిన ఆదేశాలతో ఉపాధ్యాయులు, సంఘ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన, పరీక్షలు చదువులు జరిగితే ఆ ప్రభావం దపో తరగతి ఫలితాలపై పడుతుందని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. కాగా, సమస్య పరిష్కారానికి కొన్ని సంఘాల నాయకులు పిడిఎఫ్ ఎమ్మెల్సీల దృష్టికి సమస్యని ఆదివారం తీసుకుని వెళ్లనున్నారు. మరికొన్ని సంఘాలు ప్రభుత్వ తీరుని వ్యతిరేకిస్తూ... న్యాయస్థానాలను ఆశ్రయించనున్నాయి. దీనిపై ప్రభుత్వ విద్యాశాఖ ఏ రీతిన స్పందిస్తుందో వేచి చూడాలి.

అన్యాయం

ప్రభుత్వ పాఠశాలలన్నీ ఆంగ్ల మాధ్యమంలోనే బోధన చేసి పరీక్షలు కూడా నిర్వహించాలని చెప్పడం అన్యాయం. జాతీయ విద్యా మండలి ఆదేశాల మేరకు నిర్ణయాలు తీసుకుంటే ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో రెండు సెక్షన్లు ఉండాలి కానీ, ప్రభుత్వం ఎందుకు ఏర్పాటు చేయలేదు. మ్యామాన్ని ఎంచుకునే ఆవకాశాన్ని చదివే విద్యార్థికి ఇవ్వాలి. మాధ్యమాన్ని బలవంతంగా రుద్దేముందు గ్రామీణ స్థాయి విద్యార్థులను పరిగణనలోకి తీసుకోవాలి. దీనిపై విద్యాశాఖ స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి.

- కురమాన దాలయ్య, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు

ఫలితాలపై ప్రభావం

ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఫలితాలపై పడుతుంది. విద్యారంగాన్ని నాశనం చేసే చర్యలు ఇవి. మాధ్యమాన్ని బలవంతంగా విద్యార్థులపై రుద్దడం అన్యాయం. మాధ్యమం ఎంచుకునే విధానంలో నిబంధనలు ఎందుకు పాటించలేదు. ఇప్పుడు విద్యార్థులను బలిచేయడం సబబు కాదు.

- వాల్తేరు సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు

ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

మినీ కేంద్రాల స్థాయి పెంచాలి

కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మినీ అంగన్వాడీ కేంద్రాల స్థాయిని పెంచి ప్రధాన కేంద్రాలుగా మార్చాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యాన ఆర్‌అండ్‌బి కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ జిఒ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాన కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలతో సమానంగా మినీ కార్యకర్తలకు వేతనాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో పేద గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు సేవలందిస్తున్న మినీ వర్కర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. మినీ కేంద్రాల్లో కార్యకర్తలతో పాటు, హెల్పర్లకు పని అప్పగించడంతో పనిభారం పెరిగిందన్నారు. మినీవర్కర్లు లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తే చాలని నియమించి ఇప్పుడు పనిభారాన్ని పెంచి ప్రధాన కేంద్రాల్లో పనిచేస్తున్న అన్ని పనులు అప్పగించడం సరికాదన్నారు. ప్రీ స్కూల్ నడపడం, పిల్లలకు వంట చేయటం, పెరుగుతున్న యాప్‌ల భారంతో ఆన్‌లైన్ వర్కులు, ఆఫ్ లైన్‌లో రికార్డుల నిర్వహణ బాధ్యతలను మినీవర్కర్ చేయలేకపోతున్నారని అన్నారు. 300 నుంచి 1200 వరకు జనాభా ఉన్న మినీ సెంటర్లుగానే కొనసాగిస్తున్నారన్నారు. అంగన్వాడీలు మూడేళ్లుగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వేసవి సెలవులు, సూపర్‌వైజర్ పోస్టులో ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. యాప్‌ల ద్వారా చేస్తున్న పనులకు ఫోన్లు పనిచేయక పోయినా, ఇకెవైసి, ఎఫ్‌ఆర్‌ఎస్ బలవంతంగా అమలు చేస్తూ మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 42 రోజుల సమ్మె సందర్భంగా డిమాండ్లు పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం హామీనిచ్చిందని, ఇప్పటికీ అవి అమలు కాలేదని అన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లోని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు పి.లతాదేవి, కె.సుజాత, కె.లక్ష్మి, పి.భూలక్ష్మి, కె.మాధవి, కె.హేమలత, జె.కాంచన, నూకమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు ఆత్మహత్య

నవ్య (ఫైల్)

ప్రజాశక్తి- పలాస

మండలంలోని ఈదురాపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయరాలు శాసనపురి నవ్య (30) శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. కాశీబుగ్గ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బ్రాహ్మణతర్లాకు చెందిన శాసనపురి వెంకటరావుకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె నవ్య ఈదురాపల్లికి చెందిన షణ్ముఖరావులతో 2020 మార్చిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. అదే ఏడాదిలో శాసనపురి నవ్యకు ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా వజ్రపుకొత్తూరు మండలం సీతాపురం-బొడ్డపాడు పాఠశాలలో విధుల్లో చేరింది. అనంతరం 2023 జూలై నెలలో కాశీబుగ్గ సూదికొండ పాఠశాలకు బదిలీ అయింది. శనివారం ఉదయం పాఠశాలకు ఒక్క పూట సెలవు పెట్టి రెండో పూట పాఠశాలకు వస్తానని హెచ్‌ఎంకు సమాచారం ఇచ్చింది. ఇంతలో ఇంట్లో కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లగా ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతిరాలు భర్త షణ్ముఖరావు కల్‌కత్తా ప్రాంతంలో ఆర్మీలో జవాన్ పనిచేస్తున్నారు. ఈమెకు ఏడాదిన్నర కుమార్తె ఉంది. కుటుంబ కలహాలు కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఘటనా స్థలాన్ని కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ సిఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

బ్యాంకు సముదాయాల వద్ద

భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

ఎస్‌పి మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం: బ్యాంకు సముదాయాలు, నగదు లావదేవీలు జరిగే ఎటిఎంల వద్ద భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, సిసి కెమెరా లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని బ్యాంకు అధికారులను ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న బ్యాంకు అధికారులు, కో-ఆర్డినేటర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. బ్యాంకు, ఎటిఎం గార్డులు, క్యాష్ ఏజెన్సీల వ్యక్తిగత వివరాలను ముందుస్తుగా సేకరించాలన్నారు. వారి ఆదరైజేషన్, లైసెన్స్, గన్ లైసెన్స్ ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రతి బ్యాంకు ప్రవేశ ద్వారం దగ్గర నియమించిన గార్డు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయనకు కేటా యించిన విధులు సక్రమంగా నిర్వవర్తిం చేటట్లు పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎటిఎం కేంద్రాల వద్ద కూడా కచ్చితంగా గార్డు, 24ఇంటు7 నిరంతరం సెక్యూరిటీ గార్డ్ విధులు, సిసి కెమెరాలు, అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరిసరాలను కవర్ చేసేలా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాల న్నారు. వాటి పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన డేటా నిల్వలను, రికార్డులను కేసుల దర్యాప్తులో భాగంగా పోలీసు వారికి అందించాలని కోరారు. సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నంబరు 1930, వెబ్‌సైట్ www. cyber-crime.gov.in గురించి అవగాహన కల్పించి, ఫిర్యాదు చేయించాలన్నారు. సమావేశంలో శ్రీకాకుళం, కాశీబుగ్గ డిఎస్‌పిలు వివేకానంద్, వి.వెంకట అప్పారావు, ఉమెన్స్ పోలీస్‌స్టేషన్ డిఎస్‌పి రాజశేఖర్, డిపిటిసి డిఎస్‌పి ప్రసాదరావు, ఎస్‌బి సిఐ ఇమాన్యువల్ రాజు, శ్రీకాకుళం రూరల్, పట్టణ సిఐలు పైడిపునాయడు, ఈశ్వరరావు, ఆమదాలవలస సిఐ సత్యనారాయణ, సైబర్ సెల్ సిఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బలిగొన్న బావి

- నూతిలో పడి ఇద్దరు మృతి
- మృతులు సమీప బంధువులు
- కనిమెట్టలో విషాదఛాయలు

మృతదేహాలు (ఇన్‌సెట్‌లో మధుసూదనరావు, ఢిల్లేశ్వరరావు ఫైల్)

మృతికి కారణమైన బావి

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కనిమెట్టలో ఓ కుటుంబంలో ఒక్కసారిగా విషాదం అలముకుంది. బావిలో పడిపోయిన మోటార్ ఇంజిన్ కోసం అందులో దిగిని మేనమామ మృతి చెందగా, ఆయనను కాపాడేందుకు ఆయన మేనల్లుడు మృత్యువుపాలయ్యాడు. ఈ సంఘటన పొందూరు మండలం కనిమెట్ట ప్రధాన వీధిలో శనివారం చోటుచేసుకోవడంతో రఘుపతి మధుసూధనరావు (50), అదే గ్రామానికి చెందిన కింతలి ఢిల్లేశ్వరరావు (23) మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మధుసూధనరావు ఇంట్లో శుక్రవారం రాత్రి విషసర్పం రావడంతో దానిని చంపేందుకు ప్రయత్నించారు. దెబ్బ తగిలిన పాము ఇంటిముందు ఉన్న నందల నుయ్యిలో పడిపోయింది. పాము నూతిలో పడిపోవడంతో శనివారం ఉదయం మధుసూధనరావు, అతని మేనల్లుడు కింతలి ఢిల్లేశ్వరరావు పామును తీసేందుకు ఆయిల్ ఇంజిన్‌తో బావిలో నీటిని తోడుతున్నారు. ఈ సమయంలో ఆ బావిలో ఇంజిన్ పడిపోయింది. ఇంజిన్‌ను తీసేందుకు ఉదయం 10 గంటల సమయంలో మధుసూ దనరావు బావిలో దిగాడు. బావిలో నిండుగా ఉండడంతో మదుసూధనరావు ఎంతకీ పైకి రాలేదు. మేనమామ రక్షించేందుకు మేనల్లుడు కింతలి ఢిల్లేశ్వరరావు బావిలోకి దిగాడు. ఎంతకీ ఇద్దరూ పైకి రాకపోవడంతో గ్రామస్తులు వచ్చి బయటకు తీసేందుకు ప్రయత్నించారు. అయితే బావి మొత్తం ఇంజిన్ ఆయిల్‌తో నిండి ఉండడంతో పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అధికారులు అతికష్టం మీద తొలుత ఢిల్లీరావు, తరువాత మధుసూదన రావు మృతదేహాలను బయటకు తీశారు.

ఇద్దరూ నీటిలోకి దిగి ఎంతకీ రాకపోవడంతో ఢిల్వేశ్వరరావు సోదరుడు వినోద్ బావిలోకి దిగాలని ప్రయత్నించాడు. అయితే ఇద్దరు నీటిల్లో మునిగిపోవడంతో కుటుంబ సభ్యులు వినోద్ బావిలోకి దిగకుండా అడ్డుకున్నారు. బావి మొత్తం ఆయిల్ ఉండడంతో కాలుజారడంతో బయటకు రాలేక మృతి చెందినట్లు గుర్తించారు. బావిలోకి వినోద్ దిగితే ఏమి సంభవించునోనని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

గ్రామంలో విషాద ఛాయలు

వ్యవయసాయం చేసే మధుసూధనరావు, ఐటిఐ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న ఢిల్లేశ్వరరావు మృతి చెందడంతో ఇరు కుటుంబాలలోనే కాకుండా గ్రామంలోను విషాద ఛాయలు అలముకున్నాయి. మధుసూధనరావుకు భార్య సరస్వతి, కుమారుడు జగదీశ్వరరావు, వివాహమైన కుమార్తె తిరుమల ఉన్నారు. ఉద్యోగంలో చేరి ప్రయోజకుడవుతాడని ఆశించిన ఢిల్లేశ్వరరావు తల్లిదండ్రులు కింతలి చౌదరి, రాజేశ్వరి కుమారుడు మృతి చెందడంతో కుప్పకూలిపోయాడు. సమీప బంధువుల ఇంట్లో ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో పాటు బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.

కేసు నమోదు

బావిలోదిగి ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఆముదాలవలస సిఐ పి.సత్యనారాయణ పరిశీలించారు.

ప్రోటోకాల్ పాటించకపోతే ఎలా?

మండల సమావేశంలో సభ్యుల నిలదీత

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

అధికారులు సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు ప్రోటోకాల్ పాటించడం లేదని జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి అన్నారు. ఎంపిపి మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జలజీవన మిషన్ ద్వారా 215 పనులు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఆర్.మహేష్ తెలిపారు. మేఘవరం పంచాయతీలో విద్యుత్ బల్బులు, కాలువలో పుడిక తీతలు తీస్తే బిల్లులు మంజూరు చేయవద్దని టిడిపి కార్యకర్తలు చెబితే బిల్లులు ఆపేశారని సర్పంచ్ పరపతి సునీతరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంపిడిఒ జయంతిప్రసాద్ సమాధానం ఇస్తూ... బిల్లులు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. రుంకుహనుమంతుపురం పంచాయతీలో ఎరువులు, విత్తనాలు పంపిణీ చేసినప్పుడు తనకు సమాచారం ఇవ్వలేదని సర్పంచ్ ఎన్ని మన్మథరావు మండల ఎఒ ఆర్.అప్పారావును నిలదీశారు. మండలంలో 19 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు ఎఒ తెలిపారు. మినుములు, రాగులు విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. పంచాయతీరాజ్ జెఇ కె.అంజిత్ కుమార్ మాట్లాడుతూ 34 పంచాయతీల్లో ఉపాధి హామీ ద్వారా 184 పనులుగాను రూ.15 కోట్లు మంజరైనట్లు తెలిపారు. ఉపాధి హామీ ఎపిఒ నరసింహమూర్తి మాట్లాడుతూ పల్లె పండగ ద్వారా ఎం.సున్నాపల్లి, ఉమిలాడ తీర ప్రాంతంలో ఆట స్థలాల చుట్టూ మొక్కలు నాటమన్నారు. పశువులు కోసం పశుగ్రాసం పథకం, జీడి, మామిడి, కొబ్బరి మొక్కలు ఉపాధి హామీ ద్వారా రైతులకు అందజేస్తామన్నారు. బోరుభద్ర వైద్యాధికారి పి.అవని మాట్లాడుతూ ఆరు నెలల పాటు ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు కేన్సర్‌పై చేపడుతున్నామని అన్నారు. మత్స్యకార భృతి అందక మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారని మేఘవరం ఎంపిటిసి సూరాడ రాజారావు ఎఫ్‌డిఒ ధర్మరాజు పాత్రో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పొందల తులసమ్మ, తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ యు.కె.పట్నాయక్, ఎంఇఒ చిన్నవాడు తదితరులు పాల్గొన్నారు.

బాబు ద్విపాత్రాభినయం

వీక్షణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

తనలో పాత చంద్రబాబును చూస్తారంటూ పలు సందర్భాల్లో బాబు చెప్పడం చూశాం. ఇప్పుడు మరొకకొత్త పాత్రలోనూ చంద్రబాబు అభినయాన్ని జనం అదనంగా చూస్తున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత చాలా సందర్భాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బీద అరుపులు వినిపించారు. రాష్ట్రం చాలా అప్పులో ఉందని, మంత్రులు, ఎమ్మెల్యేలు పొదుపుగా వ్యవహరించాలని, ఎటువంటి ఆడంబరాలకు పోవద్దంటూ వారికి హితోపదేశం చేశారు. జిల్లాలో పర్యటనల్లో జనసమీకరణ, హంగులు, ఆర్భాటాలు వద్దంటూ అధికారులకు మరోవైపు చెప్పుకొచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చంద్రబాబు హావభావాలు చూసి రాష్ట్రం క్లిష్ట పరిస్థితులో ఉందని అంతా అనుకున్నారు. రోజుల గడుస్తున్న కొద్దీ ఆ బీద అరుపుల వెనుక అసలు విషయం ఇప్పుడు అందరికీ బోధపడుతోంది. సాధారణంగా పాఠశాలలు తెరిచినప్పుడు తల్లికి వందనం, ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయంలో టిడిపి కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీ సాయం ఇస్తుందని ఆశగా చూశారు. బాబు డబ్బులు లేవని అంతగా చెప్తుంటే ఈ సంవత్సరానికి ఇంతే అని సరిపెట్టుకున్నారు. సంక్షేమ పథకాలు, సూపర్-సిక్స్ అమలుకు ఆర్థిక పరిస్థితిని బూచిగా చూపిన బాబు కార్యకర్తలకు మేలు చేసే పనులను మాత్రం ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వారి రుణం తీర్చుకుంటున్నారు. ప్రభుత్వం ఇటీవల నాలుగు విడతల్లో నామినేటెడ్ పదవులను భర్తీ చేసి కూటమి నాయకులను, కార్యకర్తలను సంతృప్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్పొరేషన్లకు నియమించిన చైర్మన్లు, డైరెక్టర్లకు గౌరవ వేతనం, టిఎ, డిఎ రూపంలో ప్రతినెలా కోట్లాది రూపాయలను ఖర్చు చేసేందుకు ఆర్థిక పరిస్థితి అడ్డురాలేదు. రాజకీయ నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన టిడిపి కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువత ఎదురుచూస్తున్న ఉద్యోగాల భర్తీని పక్కన పెట్టింది. గ్రూప్-1, గ్రూప్-2, వంటి నోటిఫికేషన్ల ప్రకటనపై కనీసం కసరత్తు చేస్తున్నట్లు వార్తలూ రావడం లేదు. చివరకు గత ప్రభుత్వం వెలువరించిన పోలీసు రిక్రూట్‌మెంట్ ఉద్యోగాలనూ భర్తీ చేసే పని మొదలు పెట్టలేదు. ఉద్యోగాల భర్తీ అంటే కేవలం డిఎస్‌సి నోటిఫికేషనే అన్నట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గర నుంచి మంత్రులు వరకు అంతా ఆదే మాట్లాడుతున్నారు. డిఎస్‌సిపై తొలి సంతకం చేసి నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామంటూ చంద్రబాబు, లోకేష్ పదే పదే చెప్తూ యువతను ఊరిస్తున్నారు. ఇప్పుడు తాజాగా వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ చావుకబురు చల్లగా చెప్తున్నారు. ఆ విధంగా ఒక ఏడాది పాటు ఉపాధ్యాయులకు కోసం ఖర్చు చేసే పనిలేకుండా ఆర్థిక జాగ్రత్తలు తీసుకుంది. జిల్లాలో సుమారు 430 పోస్టులు ఖాళీ ఉన్నాయని అధికారులు చెప్తున్న నేపథ్యంలో ఈ సంవత్సరం ఉపాధ్యాయులు లేకుండానే విద్యా సంవత్సరాన్ని ఏదో రకంగా ముగించేయాలని ప్రభుత్వం అనుకోవడం విద్యార్థులకు అన్యాయం చేయడమే అవుతుంది. తరగతుల బోధన, పదో తరగతి ఫలితాలు ఎలా ఉన్నా ఖర్చు తగ్గించుకోవాలన్నదే లక్ష్యం అన్నట్లుగా ప్రభుత్వ తీరు కనిపిస్తోంది. నామినేటెట్ పదవులపై రెండు నెలల పాటు కసరత్తు చేసి కష్టపడిన వారికి పదవులు ఇచ్చిన బాబు ఐదు నెలలు పాటు డిఎస్‌సి కోసం శ్రమిస్తున్న నిరుద్యోగులకు మాత్రం న్యాయం చేయలేకపోయారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

డబ్బులు ఇచ్చేందుకు మనస్కరించక ఆర్థిక కష్టాలను చెప్తున్న బాబు మత్స్యకారులపైనా దయతలచలేదు. వేటకు వెళ్తే గాని పూట గడవని గంగపుత్రులకు ఇవ్వాల్సిన వేట నిషేధ పరిహారం నేటికీ చెల్లించలేదు. ఇదిగో అదిగో చెల్లిస్తామంటూ వాయిదాలు వేస్తోంది. గత నాలుగేళ్లుగా మే మూడో వారంలోనే వారు డబ్బులు అందుకుంటున్న పరిస్థితి ఉండగా, ఈ సంవత్సరం ఇప్పటి వరకు వారి ఖాతాలో డబ్బులు జమ చేయలేదు. వీరికి చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వకపోగా అప్పుడెప్పుడో 2014-18 కాలంలో నీరు-చెట్టు పనులు చేసిన టిడిపి కార్యకర్తల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు వేస్తోంది. నీరు-చెట్టు పెండింగ్ బిల్లులకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతలో రూ.335 కోట్లు విడుదల చేసింది. జిల్లాలోనూ రూ.4 కోట్ల వరకు చెల్లింపులు చేశారు. మత్స్యకారులపై మాటల్లో ఎనలేని ప్రేమ చూపే బాబు చెల్లింపులు, సంక్షేమం దగ్గరకొచ్చే సరికి వారు మాత్రం వారు గుర్తుకు రావడం లేదు.

తాము కక్ష సాధింపులకు పాల్పడబోమని, చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామంటూ చంద్రబాబు పైకి చెప్తున్నా జరుగుతుంది మాత్రం వేరుగా ఉంది. సోషల్ మీడియాలో అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టేవారిని శిక్షించాల్సిందే. ఆ పేరుతో విచక్షణారహితంగా కేసులు పెట్టి వేధించడాన్ని ఎవరూ స్వాగతించరు. సాధారణ పోస్టులను పెట్టేవారిని సైతం భయభ్రాంతులకు గురి చేసేలా ప్రస్తుతం ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వ్యవహరిస్తుండటం మనం చూస్తున్నాం. కక్ష సాధింపులు లేవంటూనే రాష్ట్రంలోని మారుమూల పోలీసుస్టేషన్లతో కేసులు నమోదు చేసి వారిని పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పే పనికి ప్రభుత్వం తెర తీసింది.

ఎన్నికల ప్రచార సభలో సాగునీటి ప్రాజెక్టులు, జిల్లా అభివృద్ధిపై అనేక హామీలను గుప్పించిన బాబు బడ్జెట్‌లో కేటాయింపుల దగ్గరకొచ్చే సరికి మాత్రం ఆ ప్రేమ కనపడలేదు. వంశధార ప్రాజెకు-1 నిర్వహణ పనుల కోసం అధికారులు రూ.10 కోట్లు కావాలని ప్రతిపాదిస్తే ప్రభుత్వం కేవలం రూ.కోటి మాత్రమే ఇచ్చింది. వంశధార ప్రాజెక్టు ఫేజ్-2 స్టేజ్-2కు రూ.170 కోట్లు కావాలని అడిగితే బడ్జెట్‌లో రూ.63.50 కోట్లను కేటాయించింది. ఆఫ్‌షోర్ రిజర్వాయరు ప్రాజెక్టుకు రూ.108 కోట్లు అవసరమని ప్రతిపాదిస్తే ప్రభుత్వం 37.71 కోట్లను కేటాయించింది. జలవనరులశాఖ ద్వారా చేపట్టనున్న సాగునీటి ప్రాజెక్టుల కోసం అధికారులు సుమారు రూ.480 కోట్లతో ప్రతిపాదనలు పంపినా ఏ ప్రాజెక్టుకూ ఒక్క పైసా కూడా విదల్చకుండా మొండిచేయిచూపడం చూస్తే జిల్లాపై బాబుకు ఉన్న ప్రేమ ఏపాటితో అర్థమవుతోంది. ఇదే నెలలో జిల్లాకు వచ్చిన చంద్రబాబు ఈదుపురం సభలో జిల్లా రూపురేఖలే పోతాయన్నట్లుగా ప్రసంగించారు. మూలపేటలో 10 వేల ఎకరాలతో పారిశ్రామిక కారిడర్, టెక్కలి, పలాస ప్రాంతంలో ఎయిర్ పోర్టు ఇలా అనేక వాగ్దానాలు ఇస్తూ జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత తనదని చెప్పుకొచ్చారు. బడ్జెట్‌లో కేటాయింపులకు, బాబు మాటలకు పొంతన లేకపోవడం చూస్తే అసలు చంద్రబాబు ఎవరి అభివృద్ధి కోసం మాట్లాడారా? అని జనం సందేహంలో పడ్డారు. పారిశ్రామిక కారిడర్, ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తల అభివృద్ధిని కోరుకుంటున్నారా? నిజంగానే జిల్లా అభివృద్ధిని కాంక్షిస్తున్నారా? లేక ఇందులోనూ ద్విపాత్ర అభినయమేనా? అని చర్చించుకుంటున్నారు. ఇటీవల అమరావతిలో కూటమి ఎమ్మెల్యేలతో చంద్రబాబు నిర్వహించిన సమావేశంలో సభలోనూ, బయటా భాష, ప్రవర్తన చాలా కీలకమని ప్రజలు గమనిస్తుంటారని వారికి హితోపదేశం చేశారు. ప్రజలు ఎమ్మెల్యేలనే కాదు ప్రభుత్వం నిర్ణయాలు, బాబు ద్విపాత్రా అభినయాన్నీ గమనిస్తున్నారన్న విషయం కూటమి నేతలు గుర్తెరగాలి.

IN THE HONOURABLE COURT OF THE 3rd ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM.
EP.19/2019 A.R.C.680/2016

BETWEEN:
M/s Shriram City Union Finance Limited, Narasanna peta Duly Represented By its PA Holder & Authorized Signatory in Office, Sri P. Jagadeeswara Rao ...Decree Holder
AND
Venkata Ramana Subuddhi Guptha Kalivarapu & Others ...Judgement Debtor

To
R1) Venkata Ramana Subuddhi Guptha Kalivarapu S/o Kamalanabham, Hindu, aged: 56 years, OCC: Jewellery business, D.NO:14-116,Old SBI Street, Narasannapeta village and Mandalam, Srikakulam district.
R2) Usha Rani Kalivarapu W/o Venkata Ramana Subuddi Gupta Kalivarapu Hindu, aged 48, OCC: Jewellary Business, D.NO 14- 116, Old SBI Street, Narasannapeta Village and Mandalam Srikakulam Dist.
R3) Kumara Swamy Pragada S/o Vekata Appa rao, Hindu, Aged 67 years D.No 1257, Urlam, Narasannapeta, Srikakulam Dist.

AGAINST WHOM IT HAS BEEN EXECUTION IS SOUGHT AGAINST THE JDR NO. 1

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పై నెంబరు అమలులో అవార్డు సొమ్ము, వడ్డీ మరియు ఇతర ఖర్చులు రాబట్టే నిమిత్తం పైన ఉదహరించిన న్యాయస్థానంలో తేది 03-12-2024 ఉదయం గం॥ 10.30 ని॥ల నుండి సాయంత్రం 5 గం॥ల మధ్య కాలంలో బహిరంగంగా వేలం వేయబడును. కావున కావలసినవారు ఆ సమయంలో వేలంలో పాల్గొన వచ్చునని ఇందుమూలంగా తెలియపర్చడమైనది.

PETITION SCHEDULE FILED BY THE DECREE HOLDER MOST RESPECTFULLY SHOWETH AS FOLLOWS:

Srikakulam District, Narasannapeta Sub Registry, Narasannapeta Mandal, Narasannapeta Village and Panchayat, Borigivalasa village records under RSNo 187/6, Southern row of Kalivarapupeta street, existing RCC roofed ground floor and first floor house within the site with old Door No.92, 5-2-76, 8-79, 8-89 of old Assessment Nos. 519-649, 901 and corresponding new assessment No. 1394 and new Door No. 9-99 within ward No.7, Block No.9 With the following measurements. East to West on Southern side: 36 Feet (10.92 Meters) North to South: 76 Feet (23.05 Meters). **East:** Joint wall between this property and with that of K. Vananamurty, **South:** Jogampeta Panchayat road, **West:** Road Between this Property and of K. Ramanayya house, **North:** Road Leading to Kalivarapupeta.

DHR value : 37,21,115/-
Amine Value : 40,00,000/-
Hearing date : 03.12.2024
Further Hearing date : 10.12.2024

MANCHU JANARDHANA RAO, Advocate
Jami Thota, Visakha 'A' Colony, Srikakulam Town & Dist.
Ph. No : 9849178948, 9704986271 9866509590, 9849824246

పశు గణనలో పాల్గొన్న పశుసంవర్ధక జెడి మురళీధర్

సక్రమంగా పశుగణన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పశుగణను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని పశుసంవర్ధకశాఖ జెడి ఆర్.మురళీధర్ అన్నారు. శనివారం మండలంలోని శ్రీహరిపురం గ్రామం, పురపాలక సంఘంలోని రెండవ వార్డు పరిధిలోని కృష్ణాపురంలో పర్యటించి 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పశుగణన సిబ్బందితో కలిసి వారి పనితీరును పరిశీలించి పలు విషయాలపై అవగాహన కల్పించి తగు సూచనలు సలహాలను అందించారు. పశుగణనలో భాగంగా నాలుగు రకాల ఇంటింటి సర్వేలను సిబ్బందికి వివరించారు. రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ రోణంకి ఆనందరావు, పశుగణన సిబ్బంది, పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఐఇఐ కౌన్సిల్ సభ్యునిగా శ్రీనివాసరావు

శ్రీనివాసరావు

శ్రీకాకుళం అర్బన్: జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా (ఐఈఐ)కు కౌన్సిల్ ఆంధ్ర రాష్ట్రం నుంచి ముని శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. శనివారం జాతీయస్థాయి ఎన్నికలను విజయవాడలో నిర్వహించారు. రెండేళ్ల పాటు కొనసాగనున్న ఈ పదవి కోసం రాష్ట్రం నుంచి ఎనిమిది మంది పోటీ పడ్డారు. స్టేట్ కమిటీకి సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో విజయవాడకు చెందిన ఎవి రామకృష్ణ ప్రసాద్, శ్రీకాకుళానికి చెందిన ముని శ్రీనివాసరావు, కడప నుంచి ఎ వెంకటేశ్వర్లు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లుగా ఎన్నికయ్యారు.

అనంతగిరిపేటలో సమస్యల తిష్ట

రాళ్లు తేలిన రహదారి

- తాగునీటికి గగనం
- రాళ్లు తేలిన రహదారి
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

ప్రత్యేక కార్యక్రమాల ద్వారా గ్రామాలను సందర్శించిన ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల ఆర్భాటాలు కనిపిస్తు న్నాయి తప్ప, గ్రామాల్లో సమస్యలు మాత్రం తీరడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో సమస్యలు వేధిస్తూనే ఉన్నాయి.

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అనంతగిరి పేట గిరిజన గ్రామంలో సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయి. దశాబ్దాల కాలంగా గ్రామంలో నిర్మించిన బావి నీరే అన్ని అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం ఆ నీటిని సేవించడం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, పలు దఫాలుగా అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గిరిజనులు వాపోతున్నారు. గతంలో గ్రామంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వీలుగా ఇంటిదగ్గర ఏర్పాటు చేసేందుకు పైపులైన్లు తెచ్చి వదిలేశారని, అవి ప్రస్తుతం నిరుప యోగంగా ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. ముఖ్యంగా ఇటీవల

కుళాయి పైపులైను కోసం తెచ్చిన పైపులు

వాడుకనీటి కోసం ఉపయోగిస్తున్న బావి, బోరు

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఈ గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా గ్రామస్తులు తమ నీటి కష్టాలను ఎమ్మెల్యే ముందు ఏకరువు పెట్టారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే తాగునీటి కష్టాలు తీరుస్తానని హామీ ఇచ్చారని, అయినప్పటికీ ఇంతవరకు అధికారులు తమ గ్రామం వైపు చూడలేదని గిరిజనులు వాపోతున్నారు.

పిల్లలకు విద్య దూరం

గ్రామంలో ఇంతవరకు అంగన్వాడీ కేంద్రం గానీ, పాఠశాల గాని లేకపోవడంతో పిల్లలను గాలికి వదిలేయలేక సమీపంలోని మదనాపురంలోని పాఠశాలకు కొంతమంది పిల్లలను పంపిస్తున్నామని, అయితే అంగన్వాడీ కేంద్రం లేకపోవడం వలన పిల్లలకు సరైన పౌష్టికాహారం అందడం లేదని, అలాగే విద్య కూడా అందడం లేదని గిరిజనులు వాపోయారు. అంగన్వాడీ కేంద్రం గోపి దేవపేట గ్రామంలో ఉండడంతో బాలింతలు, చిన్నారుల పౌష్టికాహారం కోసం అష్ట కష్టాలు పడి వెళ్లాల్సి వస్తుందని వివరించారు.

రాళ్లు తేలిన రహదారి

గత ప్రభుత్వం తమ గ్రామానికి పక్కా రహదారి ఏర్పాటు చేసేందుకు రాళ్లు వేసినప్పటికీ నేటికీ పనులు చేయకపోవడంతో నడక కష్టాలు తప్పడం లేదని, ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా గ్రామంలో పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుతో పాటు రహదారి నిర్మాణం పనులు పూర్తి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

చెట్లు కింద ఆడుతున్న విద్యార్థులు

ఎన్నాళ్లీ అవస్థలు

కలుషిత నీరు తాగటం వలన పలు ఇబ్బందులు గురవు తున్నాం. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించు కోలేదు. గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

– పాలక గంగమ్మ, అనంతగిరిపేట

అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

గ్రామంలో అంగన్వాడీ కేంద్రం, పాఠశాల లేకపో వడంతో అను నిత్యం అవస్థలకు గురవు తున్నాం. అంగన్వాడీ, పాఠశాల ఏర్పాటుకు చొరవచూపాలి.

– కొండగొర్రె జ్యోతి, అనంత గిరిపేట

వాహనాల తనిఖీ

పాతపట్నం : ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు స్థానిక అంతర్రాష్ట్ర రోడ్డులో శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ నిర్వహించారు. తనిఖీలో వాహనాల పత్రాలు, మద్యం తాగి వాహనాలు నడిపే వారికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని, వారికి వాహనాలు ఇస్తే ప్రమాదాలు చోటు చేసుకుంటాయని అవగాహన కల్పించారు. పలు వాహనాల తనిఖీ నిర్వహించి పత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, చదువుపై శ్రద్ధ పెంచుకోవాలని ఎస్ఐ బుడుమూరు నిహార్ అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా శనివారం బాతుపురం ఉన్నత పాఠశాలలో విద్యా ర్థులకు అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్య నభ్యసిం చాలన్నారు. చెడుకి దూరంగా ఉండాలని కోరారు. మాదకద్రవ్యాల జోలికి వెళ్లరాదన్నారు. మాదక ద్రవ్యాలు వ్యసనపరులను చేస్తుందన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

ఇచ్ఛాపురం: మండలంలోని ఈదుపురంలో వైస్ ఎంపిపి డి.వివేకానందరెడ్డి సోదరి, వైసిపి టౌన్ మాజీ అధ్యక్షులు కాల దేవరాజు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు మృతుల కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సమస్యలపై డిఎస్‌పి ఆరా

పలాస: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లోని సమస్యలపై డిఎస్‌పి పి.వెంకట అప్పారావు ఆరా తీశారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నడిపేన రామారావుతో శనివారం సమీక్షించారు. ట్రాఫిక్ సమస్యలు, ఆక్రమణల తొలగింపు, పాత బస్టాండ్ దగ్గరలోని మార్కెట్ పరిస్థితులు, కాశీబుగ్గ 3 లైన్ రోడ్డు కూడలి, అభివృద్ధి, పోలీస్-మున్సిపల్ ఉమ్మడి కార్యాచరణ రూపకల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. సిఐ డి.మోహనరావు, మున్సిపల్‌సిబ్బంది పాల్గొన్నారు.

22న 'పినకాన' వర్ధంతి

నందిగాం: పోరాట యోధుడు, సిపిఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ పినకాన కృష్ణమూర్తి 8వ వర్ధంతి సభ మండలంలోని లక్ష్మీపురంలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు తెలిపారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు, జిల్లా కమిటీ సభ్యులు పోలాకి ప్రసాదరావు, హెచ్.ఈశ్వరరావు, కొల్లి యల్లయ్య, పి.సాంబమూర్తి, బగాది వాసుదేవరావు, న్యాయవాది పినకాన అజయ్ కుమార్ పాల్గొంటారని అన్నారు. ఈ సభకు రైతు, గిరిజన సంఘాల నాయకులు, పార్టీ సభ్యులు, సానుభూతిపరులు పాల్గొవాలని పిలుపునిచ్చారు.

సాగునీటి ప్రాజెక్టులపై 'ఎన్ఇఆర్' ప్రస్తావన

ప్రజాశక్తి- లావేరు

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టుల సమస్యలపై ఎమ్మెల్యే నదుకుదిటి ఈశ్వరరావు శనివారం అసెంబ్లీలో సభ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా లావేరు, రణస్థలం, జి.సిగడం మండలాల్లోని తోటపల్లి ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు శివారు భూములకు అందక గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో సాగునీరురాక రైతాంగం వందల కోట్లు పంట నష్టం కలిగిందని, లావేరు, రణస్థలం మండలాల్లో సాగునీటి కాలువల పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. ఎచ్చెర్ల మండలనికి నారాయణపురం కాలువ నీరు ద్వారా గత 30 ఏళ్లుగా రైతాంగం పంటలు పండించుకొనే వారని ఈ ఏడాది ఆ కాలువల్లో పూడికతీత, గుర్రపు డెక్క నిండుకోవడంతో నీరు రాలేదని, నీటిపారుదల అధికారులు మాత్రం నీరు వస్తుందని, పంటలు వేసుకోమని చెబితే రైతులు పంటలు వేసుకొన్నాక నీరులేక ఆ పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయరన్నారు. ఆ మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. లావేరు మండలంలోని బుడుమూరు, నారాయణపురం పెద్ద చెరువును మినీ రిజర్వాయర్‌గా చేయాలని, దీనికి మడ్డువలస కాలువ ద్వారా నీరు వస్తుందని, తద్వారా రణస్థలం, లావేరు మండలాల్లోని 30 వేల ఎకరాలకు సాగునీరుతో పాటుగా తాగునీరు అందుతుందన్నారు. దీనిపై సిఎం, ఇరిగేషన్ మంత్రి చర్యలు తీసుకోవాలన్నారు. మడ్డువలస ప్రాజెక్ట్ ద్వారా జి.సిగడాం మండలం వరుకు ఫేజ్-1 వచ్చి ఆగిపోయిందని, ఫేజ్-2 ద్వారా లావేరు మండలానికి పనులు జరగాలని తద్వారా బుడుమూరు, నారాయణసాగరం పెద్ద చెరువు, ఎచ్చెర్ల మండలంలోని ఎస్ఎం పురం పెద్ద చెరువులకు సాగు, తాగునీరు అవసరం తీరుతుందన్నారు. ఈ సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు.

అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

డిఎస్‌పి వివేకానంద

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రోడ్డుపై ప్రయాణించే ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ నిబంధనను విధిగా పాటించాలని, అప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని శ్రీకాకుళం డిఎస్‌పి వివేకానంద అన్నారు. ప్రపంచ రోడ్డు ప్రమాద బాధితుల జ్ఞాపక దినాన్ని రెడ్ క్రాస్ భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నడిపే వారు నిర్లక్ష్యంగా ఉంటే తనతో పాటు రోడ్డుపై ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా గమ్యాన్ని చేరడం సాధ్యం కాదన్నారు. ప్రస్తుత సమాజంలో యువత ప్రాధాన్యత పెరిగిందన్నారు. తల్లిదండ్రులు వారికిచ్చే స్వేచ్ఛను దుర్వినియోగపర్చుకుంటూ సామాజిక రుగ్మతలపై ఆకర్షితులవుతున్నారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం రీత్యా నేరమని, చిన్న వయసు వారికి వాహనాలు ఇచ్చి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని తల్లిదండ్రులకు సూచించారు. అతివేగంగా వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురైన వారిలో నూటికి నూరుశాతం యువకులేనని గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకున్న యువకులు ఆకుటుంబాలకు విషాధాన్ని మిగిల్చిన వారవుతున్నారు. అందువల్ల వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, ట్రాఫిక్ సిఐ వానపల్లి నాగరాజు, టూటౌన్ సిఐ ఈశ్వరరావు, రెడ్‌క్రాస్ మేనేజర్ జి.రమణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు, డాక్టర్ నిక్కు అప్పన్న, కళ్యాణచక్రవర్తి, చిన్మయరావు, నరసింగరావు, గుణాకరరావు, కొంక్యాన వేణుగోపాల్, పెంకి చైతన్యకుమార్, నంది ఉమాశంకర్, సుజాత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి వివేకానంద

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు మూలంగా యువత జీవితం సర్వనాశనం అవుతుందని, దీనికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ భవనంలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణా తరగతుల్లో భాగంగా యువకుతకు ధ్రువపత్రాలను అందజేశారు.

కొబ్బరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త అనూష

కవిటి: సమగ్ర సస్యరక్షణ చర్యలతో కొబ్బరిలో వ్యాధులు నియంత్రించవచ్చని రాగోలు కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ అనుష అన్నారు. మండలంలోని బల్లిపుట్టుగలో శనివారం ఒక్కరోజు రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కొబ్బరిలో వచ్చే రూగూస్ సర్పిలాకర తెల్లదోమ, గ్యానోడెర్మా, ఎర్రముక్కు నల్లముక్కు నివారణ పద్ధతులు వివరించారు. సోంపేట ఎడిఎ జగన్మోహనరావు మాట్లాడుతూ రబీ సీజన్లో రాయితీపై అందించే రాగులు, నువ్వులు, పెసర, మినుము విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కవిటి ఉద్యాన శాఖ అధికారి మాధవీలత మాట్లాడుతూ కొబ్బరిలో అంతర పంటగా కొబ్బరి సాగుతో రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. జీడి, మామిడి ఇన్సూరెన్స్ గడువు నవంబరు 21 వరకూ పొడిగించామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బడగల దుర్గాప్రసాద్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, విహెచ్ఎలు జగదీష్, సింహాచలం, ఎంపిఇఒలు లలిత, విష్ణువర్ధన్, రైతులు బృందావన్ దొలాయి, జనార్ధన్, కుశరాజు పాల్గొన్నారు.

విశ్వసనీయ వార్తలు అవసరం

మెమెంటోను అందజేస్తున్న విసి రజని

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

వాస్తవాలు, సమాజ ప్రయోజనాలు, విశ్వసనీయత వంటి అంశాలు మీడియా వార్తా రచనల్లో కనిపించాలని డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్. రజని అభిప్రాయపడ్డాడు. కల్పిత కథనాలు, ఆసత్య ప్రచారాలు, సమాజంలో చిచ్చుపెట్టే రచనలకు, పత్రికలకు ప్రాధాన్యత ఇవ్వరాదన్నారు. డా.బిఆర్ఏయూ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం శనివారం ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన 'జాతీయ పత్రికా దినోత్సవం' కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మెయిన్ స్ట్రీమ్ మీడియాతో పాటు సామాజిక ప్రసార మాధ్యమాల ద్వారా వెల్లువెత్తుతున్న సమాచార ప్రవాహంలో వార్తల్లో పారదర్శకత లోపిస్తుందని, పాఠకుడిని గందరగోళంలోకి నెట్టివేస్తున్నాయన్నారు. తొలి తరంలో ఉన్న విలువలు, అంకితభావం క్రమేపీ జర్నలిజం రంగంలో కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్శిటీలో జర్నలిజం అభ్యసన ద్వారా నేర్చుకున్న విజ్ఞానం, సమాజహితాన్ని కోరుకునేదిగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. సీనియర్ పాత్రికేయులు, రచయిత జంధ్యాల శరత్‌బాబు మాట్లాడుతూ సమాజ ప్రగతికి, చైతన్యానికి జర్నలిజం రంగం ఎంతో అవసరమైనదన్నారు. మారుతున్న కాలానుగుణంగా జర్నలిస్ట్ మారాలని, అదే సమయంలో విలువలకు, వృత్తి ధర్మానికి తిలోధకాలివ్వరాదన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు వాండ్రంగి కొండలరావు, వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.అనురాధ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం సమన్వయకర్త డా. ఆర్.తిరుపతిరావు, వర్సిటీ మీడియా వ్యవహారాల సమన్వయకర్త డా. లీలావరప్రసాదరావు, డా. వై.డి.రామదాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార రంగంలో అగ్రగామి 'అతుల్' ఆటోస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆటో వ్యాపార రంగంలో అగ్రగామిగా పేరు పొందిన 'అతుల్ ఆటోస్' విక్రయాలతో పాటు నాణ్యమైన సర్వీసును అందించడానికి నగరంలోని ఆదివారం పేట వద్ద నూతన షోరూమ్‌ను ప్రారంభించినట్టు అతుల్ ఆటోస్ సేల్స్ హెడ్ రాజేష్ రంజన్ తెలిపారు. శనివారం నగరంలోని ఆదివారం పేటలో వ్యాపార రంగంలో మూడు దశాబ్దాల అనుభవం ఉన్న రోమ్‌కోర్ డీలర్సుతో కలిసి ఏర్పాటు చేసిన షోరూమ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం అతుల్ ఆటో నేషనల్ సేల్స్ హెడ్ రాజేష్ రంజన్, రామ్ కోర్ మేనేజింగ్ పాట్నర్ ప్రకాశరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ముందుగా ఆటోలను ఆవిష్కరించి మొదటి కస్టమర్లకు తాళాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో అతుల్ ఆటో సేవలు అందిస్తుందని, మారుతున్న కాలానికి అనుగుణంగా వాహనాలను ప్రవేశ పెడుతున్నామని చెప్పారు. రామ్‌కోర్ మేనేజింగ్ పార్టనర్ ప్రకాశరావు మాట్లాడుతూ వినియోగదారులకు విస్తృతంగా సేవలు అందించడం కోసం మిగతా ప్రాంతాల్లో 6 నూతన బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ శాఖలన్నీ 30 , 40 కిలోమీటర్ల మధ్యలో ఏర్పాటు చేసి కస్టమర్లకు ఇబ్బందులను సత్వరమే పరిష్కారించేందుకు కృషిచేస్తామని భరోసా ఇచ్చారు. అన్ని విభాగాల్లో అతుల్ ఆటోస్ నెం-1 గుర్తింపు ఉందని తెలిసి ఈ డీలర్ షిప్‌ని తీసుకున్నామని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కస్టమర్ల మనసుకు నచ్చే మోడల్స్ అతుల్ ఆటోలో లభ్యం అవుతాయన్నారు. అతుల్ ఆటో జోనల్ మేనేజర్ రామారావు మాట్లాడుతూ డబుల్ బ్యాటరీతో తీర్చిదిద్దిన ఈ వాహనాలు 200 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని అన్నారు.

మాట్లాడుతున్న రాజేష్ రంజన్

సచివాలయంలో ఆధార్ సేవలు

జి.సిగడాం: అపార్ అధార్ సేవలు విద్యార్థులు సద్వినియోగం చేసుకొవాలని డిప్యూటీ తహశీల్దార్ నిర్మల, ఎంఇఒ అరసాడ రవి అన్నారు. జి.సిగడాం, నడిమివలస గ్రామ సచివాలయాల్లో ఆధార్ ట్రైనర్ రాము, సాయి ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం అపార్, అధార్ సేవలు నిర్వహించారు. డిటి నిర్మల మాట్లాడుతూ ఇంటి చిరునామా, మొబైల్ నెంబరు, ఫోటో మార్చుకోవాల్సిన వారు వేలిముద్రలు, తదితర వాటికోసం ఆధార్ కేంద్రాలను సంప్రదించా లన్నారు. పలు గ్రామాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాఠశాలల్లోనే అందుబాటులో ఉండే విధంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈమెతో పాటు కార్యదర్శి తలసీ ప్రసాద్ సాహు, సీతయ్య, గుణబాబు, భూపతి నర్సింగరావు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ, డిటి

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

లావేరు : పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న కుమార్ రాజు

ఆమదాలవలస : డిబేట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- లావేరు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వీటిని విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మురపాక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలన్నారు. చాలా మంది గ్రంథాలయాల్లో లభ్యమైన పుస్తకాలనే చదివి ఉన్నతి శిఖరాలను అధిరోహించారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి తలే రాంబాబు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే లావేరు శాఖా గ్రంథాలయంలో పోస్టుమాస్టర్ ఎ.లక్ష్మి ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, హైస్కూల్ తెలుగు పండితులు శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆర్ట్స్ కళాశాల లైబ్రేరియన్ ఇందువదన, విజయనగరం విశ్రాంత ఉప గ్రంథాలయాధికారి డి.గోపాలరావు గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వివిజిఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కర్ రాజా, సిబ్బంది ప్రత్యూష, రామ్మోహన్, కళ్యాణి, వరలక్ష్మి, రాంబాబు, గణేష్ పాల్గొన్నారు.

బలగ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

బలగ హడ్కో కాలనీలో ఉన్న శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయాధికారి ఇ.ఉగ్రసేను ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో బలగ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్ఎం సుబ్రహ్మణ్యం, నేషనల్ అవుట్ స్టాండింగ్స్ సైన్స్ అవార్డు గ్రహీత, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు అన్నెపు పుల్లయ్య, సహాయకులు కె.అనిత పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని బొడ్డేపల్లి పేటలో ఉన్న శాఖా గ్రంథాలయంలో వార్షికోత్సవాల సందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయాధికారి అన్నెపు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో డిబేట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు తమ్మినేని సూర్య నారాయణ, అంపోలు సూర్యారావులు పాల్గొన్నారు.

బూర్జ: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయాలు వాటి ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలతో పాటు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.సునీతతో పాటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

నందిగాం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంపిడిఒ టి.రాజారావు అన్నారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవంలో పెంటూరు ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు దుర్యోధన లోకనాథం, గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు. ఇందులో భాగంగా హైస్కూల్ సీనియర్స్ విభాగం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిచారు.

పాతపట్నం : స్థానిక శాఖాగ్రంథాలయం ఆధ్వర్యాన ఎఎంసి మైదానంలో విద్యార్థులకు సెటిల్ బ్యాట్మెంటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అడిషనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ లింగాల మధుబాబు, పారిశ్రామికవేత్త నూలు దుర్గాప్రసాద్ (బుజ్జి), విక్టరీ స్కూల్ డైరెక్టర్ పెద్దింటి అప్పారావు, గ్రంథాలయ అధికారి కాళ్ల రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో మహేంద్ర కళాశాలల డైరెక్టర్ ఎస్.మధుబాబు, ఎపిజివిబి విశ్రాంత మేనేజర్ ఎం.బాబూరావు, డాక్టర్ మన్మథరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బెహరా ఆధ్వర్యాన విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ విద్యా సంస్థల నుంచి వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గౌరీశంకర్ రెడ్డి, నాగమణి, సంతోష్, రవిశంకర్ మహాపాత్రో పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న అధికారులు

పలాస: నివాళ్లర్పిస్తున్న అధికారులు

పలాస : గ్రంథాలయ ఉద్యమకారుల త్యాగాలు మరువలేనివని ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు అన్నారు. శాఖాగ్రంథాలయంలో ఉద్యమకారులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2, గ్రంథాలయాధికారి వై.రాంబాబు, సిఆర్‌పి యు.అప్పలరాజు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక గ్రంథాలయంలో ఉద్యమాకారుల చిత్రపటానికి ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆర్.అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తూరు : శాఖాగ్రంథాలయంలో ఉద్యమకారుల చిత్రపటాలకు పారాపురానికి చెందిన సాహితీ వేత్త బి.ధనుంజయరావు, గ్రంథాలయాధికారి టి.ఇందిర పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఇరిగేషన్ మంత్రిని కలిసిన 'ఎంజిఆర్'

వినతి అందజేస్తున్న ఎమ్మెల్యే

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గంలో ప్రజలు వ్యవసాయం జీవనాధారంగా ఉపాధి కలిగి ఉన్నారని, రైతులకు ఇబ్బంది కలగకుండా ఇరిగేషన్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు జల వనరులశాఖ మాత్యులు డాక్టర్ నిమ్మల రామా నాయుడుని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజక వర్గంలో ఎత్తిపోతల పథకాలు మంజూరు, పాడైన పథకాలను మర మ్మతులు చేపట్టాలని విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

అశ్రునయనాలతో ఆర్మీ జవాన్ అంత్యక్రియలు

భారీగా తరలివచ్చిన మాజీ సైనికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్, ఎచ్చెర్ల

రాజస్థాన్ రాష్ట్రం లోని బికనేరు యూనిట్‌లో వైర్లెస్ విభాగంగా లాన్స్ నాయక్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్మీ జవాన్ మొదలవలస చిన్నారావు (33) ఈనెల 4న అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు చిన్నారావు స్వస్థలం ఎచ్చెర్ల మండలం ఫరీద్ పేట గ్రామం. ఆయన గత కొంత కాలంగా అక్కడే విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పంచనామా, పోస్టుమార్టం ఇతర లాంచనాలు పూర్తి చేసిన ఆర్మీ అధికారులు విమానంలో విశాఖకు తీసుకొచ్చి అక్కడినుంచి రోడ్డు మార్గాన స్వస్థలం ఫరీదు పేటకు చేర్చారు. మృతునికి భార్య సులోచన, కుమారుడు మోక్షిత్, కుమార్తె తేజశ్విని ఉన్నారు. ఆయన మృతదేహం గ్రామానికి చేరుకున్న తర్వాత వందలాదిగా అభిమానులు, గ్రామస్తులు, మాజీ సైనికులు, బంధువులు తరలివచ్చి అశృనయనాలతో కన్నీటి వీడ్కోలు పలికారు. మాజీ సైనికులు ఆయన పార్థీవదేహం వద్ద అంజలి ఘటించారు. ముందుగా రాజస్థాన్ నుంచి వచ్చిన ఆర్మీ అధికారులు జాతీయ పతాకాన్ని ఆయన తల్లి, భార్యకు అందించారు. అనంతరం గ్రామం నుంచి అంతిమయాత్ర నిర్వహించి శ్మశాన వాటికకు తరలించారు. సైనికాధికారుల సమక్షంలో ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ హెడ్‌క్వార్టర్సు నుంచి వచ్చిన పోలీసులు ఆయన అంతిమ యాత్రలో పాల్గొని వీడ్కోలు పలికారు. వీడ్కోలు అనంతరం పోలీసులు గార్డ్ అఫ్ హానర్ చేశారు. గాలిలో మూడు రౌండ్ల కాల్పులు జరిపి గౌరవవందనాన్ని సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్.రామకృష్ణ, కోశాధికారి ఎం.సింహాచలం, జాయింట్ సెక్రటరీ పైడి రామారావు, సభ్యులు రాంబాబు, వాసుదేవరావు, జి.రామారావు, పైడి నాగేశ్వర రావు, ఫరీద్‌పేటకు చెందిన మాజీ సైనికులు అప్పన్న, నారాయణమూర్తి, వి.ఈశ్వరరావు, ఎస్.పి.రావు, అమ్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.

గార్డ్ ఆఫ్ హానర్ చేస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) చిన్నారావు (ఫైల్)

మహిళలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

మత్తు పదార్థాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మత్తు పదార్థాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె. వెంకటేష్ అన్నారు. శనివారం పురపాలక సంఘంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలు, మైనర్లు వాహనాలు నడపడం, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం చిత్తు అవుతుందన్నారు. గంజాయి విక్రయించే వారి వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం రెండవవార్డు తిమ్మాపురంలో ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణాలు ఇప్పిస్తామని ఎవరైనా ఫోన్ చేసి వివరాలు అడిగితే అటువంటి వారికి ఎటువంటి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. గుర్తింపు లేని అనధికార చిట్ ఫండ్‌లలో చిట్స్ కట్టి మోస పోవద్దని అన్నారు. సైబర్ నేరగాళ్లు పంపించే లింకులపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్ర బ్యాడ్మింటన్ జట్టు మేనేజర్‌గా రాజు

ప్రజాశక్తి- పాతపట్నం

రాజు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ జట్టు మేనేజర్‌గా మండల సబ్ రిజిస్టర్ డాక్టర్ గురుబెల్లి రాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి డాక్టర్ అంకమ్మ చౌదరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒడిశాలోని ఈ నెల 18 నుంచి 25 వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలకు మేనేజర్‌గా వ్యవహరించనున్నారని తెలిపారు. సబ్ రిజిస్టర్ రాజు స్వగ్రామం విజయనగరం జిల్లా సంతకవిటి మండలం వాల్తేరు. వారి గ్రామంలో సొంతంగా గ్రంథాలయం ఏర్పాటు చేసి విద్యార్థులకు, పేద విద్యార్థులకు తగిన సహాయ సహకారాలు అందిస్తున్నారు. రాజు పాతపట్నం మండల సబ్ రిజిస్టర్‌గా పనిచేస్తున్నారు. దీంతో గ్రామస్తులు, సిబ్బంది, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ సంఘం సిఇఒ సంపతిరావు సూరిబాబు, చీఫ్ పాట్రన్ డాక్టర్ సోమేశ్వరరావు, చైర్మన్ రాజేందర్, అధ్యక్ష, కార్యదర్శులు కిల్లంశెట్టి సాగర్, అశోక్ అభినందించారు.

జీడిపిక్క బొమ్మ ఔన్నత్యాన్ని చాటుదాం

ప్రజాశక్తి- పలాస

పలాస జీడీపిక్క బొమ్మ వద్ద ఇటువంటి పోస్టర్లు, బ్యానర్లు పెట్టకుండా జీడిపిక్క బొమ్మ ప్రాధాన్యతను కాపాడుదామని గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనాల గోపాల్ కోరారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గ్రీన్ ఆర్మీ, యూత్ అసోసియేషన్ సంయుక్తముగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 24వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి సప్ప నవీన్‌కుమార్ మాట్లాడుతూ జీడిపిక్క ఔన్నత్యాన్ని, సింబల్‌ను తెలియజేసే ప్రాంతంలో బ్యానర్స్, ఫ్లెక్సీలు తగిలించవద్దని కోరారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి క్లీన్ పలాస దిశగా యువత, పురప్రజలు చేయిచేయా కలపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఎస్.ఉమాశంకర్, శానిటరీ సూపర్‌వైజర్ సోమేష్, దిలీప్, శంకర్ సెక్రెటరీ మోహనరావు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో వరిసాగు

గిరులపై సిరుల సాగు

ప్రజాశక్తి- బూర్జ

గిరులపై సిరుల సాగవుతున్నాయి. మండలంలోని అనంతగిరిపేట, సోముదాలవలస, జంగాలపాడు, హరిపురం, పల్లాపురం, తిమ్మడం, కొత్తవలస, బొమ్మిక తదితర గిరిజన గ్రామాల్లో వ్యవసాయంలో నిమగ్నమైన గిరిజనులు ప్రస్తుతం వరిసాగుపై దృష్టి సారిస్తున్నారు. గత కొన్నేళ్లుగా పోడు వ్యవసాయంతో పాటు వరిని సాగు చేయడంలో ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో కొండ దిగువ భాగంలో వరిని పండిస్తున్నారు. అంతేకాకుండా ఎకరా విస్తీర్ణంలో సుమారు 35 నుంచి 40 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుందని గిరిజన రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో పూర్వీకుల నుంచి పోడు వ్యవసాయం చేసేవారమని, అప్పట్లో పంటలు పండకపోతే పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉండేదని రైతులు తెలిపారు. ప్రస్తుతం వరిసాగుపై అవగాహన ఏర్పడటంతో వరిసాగు చేస్తున్నామని తెలిపారు. వరికి అవసరమైన సాగునీరు కూడా కొండల నుంచి జాలువారే నీటిని వినియోగించు కుంటున్నామని తెలిపారు.

పనులను ప్రారంభిస్తున్న అధికారులు

రైల్వే కాలినడక బ్రిడ్జి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- కవిటి

జాడుపూడి రైల్వే స్టేషన్‌లో ఎన్నో ఏళ్లగా అసంపూర్తిగా ఉన్న రైల్వే కాలినడక బ్రిడ్జి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. జాడుపూడి - బసవకొత్తూరు గ్రామాలను కలుపుతూ రూ.85 లక్షల వ్యయంతో కూడిన ఈ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బ్రిడ్జి మంజూరుకు కృషి చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు, ఎమ్మెల్యే అశోక్‌కు రైల్వే జడ్ఆర్‌యుసి సభ్యుడు శ్రీనివాస రౌలో, బసవకొత్తూరు, బసవపుట్టుగ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే ఐఒఎస్ ఎస్.ఎన్.పండా, సంతోష్ పట్నాయక్, మణిచంద్రప్రకాష్, బాసుదేవ్ రౌలో, బి.వాసుదేవ్, మోహనరావు, రాఘవులు, కాంట్రాక్టర్ పరశయ్య పాల్గొన్నారు.

వైసిపి నాయకుల పరామర్శ

కోటబొమ్మాళి: ఇటీవల కిడ్నీ వ్యాధి మహమ్మారితో మృతి చెందిన తలగాపు ఝాన్సీ కుటుంబ సభ్యులకు శనివారం పలువురు ప్రజాప్రతినిధులు పరామర్శించారు. సీనియర్ జర్నలిస్టు తలగాపు వెంకటరమణను స్వగృహంలో పరామర్శించి, తమ సంతాపం తెలియజేశారు. ముందుగా ఝాన్సీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పరామర్శించిన వారిలో వైసిపి నాయకులు జి.గురునాథయాదవ్, మందస సర్పంచ్ ప్రతినిధి చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, న్యాయవాది వై.కృష్ణమూర్తి, మెట్ట ఆనందరావు, విలేఖరి కామేశ్వరరావు, ఎస్. గోపి, పినకాన ముకుంద, సీతమ్మ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి- జి.సిగడాం

ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడి పెడితే అధిక దిగుబడులు వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి రేవతి అన్నారు. ధవలపేట మాజీ సర్పంచ్ కె.సూరినాయుడు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ శిక్షణ, వనరుల కేంద్రం (ఎన్.పి.ఎమ్) షాపు ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా దశపర్ని ద్రావణం 200 లీటర్లు, అగ్నస్త్రం 100 లీటర్లు, బ్రహ్మాస్త్రం 100 లీటర్లు రైతులతో సామూహికంగా తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చున్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ ఎ.గోవిందరెడ్డి, ఎమ్‌టి కృష్ణ, డిఎంఎం టి.భాస్కరరావు, విఎఎ లక్ష్మీనారాయణ, విఒఎ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం : కషాయాలను తయారు చేయిస్తున్న డిపిఎం రేవతి

లావేరు: విసముసిడి కషాయంతో మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ సాధ్య పడుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పారావు అన్నారు. శనివారం మండలంలోని కొత్తకుంకం పంచాయతీ ఎల్ఎన్ పురంలో సామూహికంగా రైతులకు మొక్కజొన్నలో వచ్చే కత్తెర పురుగు నివారణ కోసం విషముసిడి 380 లీటర్లు తయారు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కషాయం తక్కువ ఖర్చుతో తయారవుతుందన్నారు. గత రెండేళ్లుగా విసముసిడి కషాయం పిచికారీ చేస్తే కత్తెర పురుగు నివారణ జరిగిందన్నారు. దీంతో పాటు పైరు పెరుగుదల, పంట దిగుబడి బాగా వస్తుందన్నారు సిబ్బంది రాంబాబు, సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణ జరగాలని డిజిటల్ ఎల్‌టు సురేష్ అన్నారు. శనివారం మండలంలోని చేపేనపేట యూనిట్ పరిధిలో కొరపాం, నిమ్మతోర్లాడలో రైతుసేవా కేంద్రాల్లో ప్రకృతి వ్యవసాయ విధాన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతిఒక్క రైతు ప్రకృతి వ్యవసాయంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయం చేయడానికి అవసరమైన ప్రోత్సాహాన్ని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పూర్తిస్థాయిలో రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు లావణ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు మానసికంగా బలోపేతం కావాలి

ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతిశ్రీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బాలికలు మానసికంగా బలోపేతం కావాలని, స్వీయ సంరక్షణ అలవర్చుకోవాలని ఐసిడిఎస్ పీడీ బగాది శాంతిశ్రీ అన్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఐసిడిఎస్ ఆధ్వర్యాన కిశోర వికాసం శిక్షణా తరగతులను శనివారం ప్రారంభించారు. ముందుగా పవర్ పాయింట్ ప్రెజెంటేష్ ద్వారా కిశోర బాలల పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, బాలల హక్కులు, బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలు, బాలల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన శిక్షకులు జిల్లాలో సంబంధిత శాఖల అధికారులకు శిక్షణ ఇచ్చారు. జిల్లాస్థాయిలో శిక్షణ పొందిన ఆరు శాఖలకు చెందిన అధికారులు మండల, గ్రామస్థాయిలో సంబంధిత విభాగాల ఉద్యోగులకు శిక్షణ ఇస్తారని అన్నారు. గ్రామస్థాయిలో కౌమార బాలికలను గుర్తించి వారిని బృందాలుగా చేసి వివిధ అంశాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. సింగుపురం పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డా.లిలీ మాట్లాడుతూ కిశోర్ బాలికా వికాసంపై గుంటూరులో శిక్షణ తీసుకున్నామని అన్నారు. ఆహారం తీసుకునే ముందు, తరువాత ప్రతిఒక్కరూ చేతులు శుభ్రపర్చుకోవాలన్నారు. పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి బాలికా రక్తహీనతకి గురికాకుండా బలమైన ఆహారం తీసుకోవాలన్నారు. డివిఇఒ ఎస్.తవిటినాయుడు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు కిశోర వికాసం కార్యక్రమాన్ని పున్హప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మహిళా మార్గదర్శి ఎన్.జి ఒ శ్రీనివాస్, విద్యా ఫౌండేషన్ ఎన్‌జిఒ యు.ప్రసాద్, రిసోర్స్‌పర్సన్లు డిసిపిఒ కె.వి. రమణ, ఎస్.నీరజ, టి.సుజాత, 30 మండలాల నుంచి మెడికల్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల లెక్చరర్స్, ఇఒపిఆర్‌డిలు, సిడిపిఒలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ

నేత్రాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- రణస్థలం

కొంతమంది వెలుగును చూడలేరు. ఎండ వెలుగులోకి వెళ్లగానే కళ్ల నుంచి నీరు కారిపోతూ ఉంటాయి. ఈ పరిస్థితి ఇబ్బందిగా ఉండేవారు కొన్ని జాగ్రత్తలు పాటించాలని స్థానిక కళ్యాణి కంటి ఆస్పత్రి అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణి సూచించారు. సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాల నుంచి కళ్లను రక్షించడం కోసం, కళ్లలో ఉండే, లాక్రిమల్ గ్రంథులు ప్రేరేపితమై కళ్లకు తేమనివ్వడం కోసం నీళ్లను స్రవిస్తాయి. అయితే కొందరిలో ఈ గ్రంథులు అవసరానికి మించి పని చేస్తూ ఉంటాయి. మరీ ముఖ్యంగా డ్రై ఐ సిండ్రోమ్, అలర్జీలు ఉన్న వాళ్లలో ఈ గ్రంథులు అతిగా స్పందిస్తాయి. దాంతో వెలుగును చూసిన వెంటనే కళ్ల నుంచి నీరు స్రవించడం మొదలు పెడుతుందన్నారు. ఈ లక్షణానికి తోడు నొప్పి, మంట, దురద, చూపులో మార్పు లాంటి అదనపు లక్షణాలు కనిపిస్తే, ఆ పరిస్థితిని కెరటైటిస్'గా పరిగణించి, వైద్యులను సంప్రదించాలన్నారు. ఫొటోఫోబియా ఉన్నవాళ్ల కళ్లు వెలుగును తట్టుకోలేవు. ఈ కోవకు చెందినవాళ్లు వెలుగులోకి రాగానే కళ్లను చికిలిస్తూ ఉంటారు. ఈ లక్షణాన్ని కూడా వైద్యులు కచ్చితంగా అంచనా వేయగలుగుతారు. అత్యధిక అతినీలలోహిత కిరణాలకు బహిర్గతం కావడం, గాలి కాలుష్యాల వల్ల కూడా వెలుగుకు కళ్లు అతిగా స్పందించి నీళ్లు కారతాయి. ఇలాంటి సమస్య ఉన్నవాళ్లు అతినీలలోహిత కిరణాలను అడ్డుకునే చలువ కళ్లద్దాలు వాడుకోవడంతో పాటు, వైద్యులు సూచించే కంటి చుక్కలు కూడా వాడుకోవాలి. కళ్లలోని కన్నీటి నాళాలు వాతావరణ ప్రభావాలకు గురి కాకుండా అన్ని వైపులా మూసి ఉండే చలువ కళ్లజోడులను పెట్టుకోవాలి.

ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో 2006లో పదో తరగతి విద్యార్థులు అదే గ్రామానికి చెందిన సాంఘీకశాస్త్రం బోధించిన ఉపాధ్యాయులు తర్ర అప్పారావు రూ.15 వేలు ఆర్థికసాయం వనివారం అందజేశారు. ఉపాధ్యాయులు కొద్ది రోజులుగా పెరలసిస్ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆదుకున్నారు. కార్యక్రమంలో తాతారావు, నీలం, సురేష్, కె.గోవింద, వై.ప్రసాద్, సింహాచలం, ఇంద్ర, బి.నారాయణ, చల్ల నారాయణ, కె.మహేష్, ఎస్.మహేష్, రమేష్, నర్సింహులు పాల్గొన్నారు.

శివాలయానికి ధార పాత్ర విరాళం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం గ్రామ దేవత స్వేచ్ఛా వతి అమ్మవారి ఆలయంలోని శివాలయానికి వ్యాపారవేత్త నిమ్మన హేడాంబరరావు శనివారం ధార పాత్ర విరాళంగా అందించారు. స్వచ్ఛావతి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో బ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఉపాలయానికి రూ. 4 లక్షల విలువైన నాలుగు కేజీల కేజీల ధార పాత్ర విరాళంగా పెద్దబాబు అందజేశారు. ఆలయాభివృద్ధికి దాతలు సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

సీనియర్ పాత్రికేయులకు సత్కారం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో సుదీర్ఘకాలం పాటు పత్రికా రంగంలో సేవలందిస్తూ ప్రజాపక్షాన సూచనలు అందిస్తున్న పత్రికా మిత్రులు అనపాన నాగిరెడ్డి, మాడుగుల వరప్రసాదరావులు అని పలువురు పత్రిక ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. శనివారం జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో వారిరువురిని తోటి సహచర పత్రిక ప్రతినిధులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. వార్తల సేకరణలో ప్రజల పక్షాననిలుస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు మురళీధర్, లోచన్‌బాబు, జగదీశ్వరరావు, క్రాంతి, మాధవరావు, భాస్కరరావు, రామారావు, శ్రీరామ్ చాణిక్య, సింహాచలం, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. శనివారం సరుబుజ్జిలి మండలంలోని షలంత్రిలో స్వయం సహాయక సంఘ సభ్యులకు యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలని మహిళలకు సూచించారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా ఫోన్ చేసి ఎటిఎం పిన్ కార్డు, బ్యాంకు అకౌంటు తదితర వివరాలను ఎవరైనా అడిగితే అటువంటి వారికి వివరాలు చెప్పవద్దన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, సురక్ష బీమా యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్మెన్ టోల్ ఫ్రీ నెంబర్ 14448 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ స్వరూపరాణి, అగ్రికల్చరల్ అసిస్టెంట్ లావణ్య, మహిళా పోలీస్ రోజా, విఒఎ పాలకొండ లావణ్య, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజాస్వామ్య వ్యవస్థకు పత్రిక వ్యవస్థే మూల స్తంబమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలతో పాటు నాలుగో వ్యవస్థగా మీడియా ఉందన్నారు. ఏ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోయినా చక్కదిద్దగలిగే సామర్థ్యం పత్రికా వ్యవస్థ, మీడియాకు ఉందన్నారు. స్వాతంత్ర్య పోరాటం మొదలు ఎన్నో గొప్పగొప్ప కార్యక్రమాలకు మీడియా స్ఫూర్తినింపిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు పత్రికా పఠనం ద్వారా రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ అన్ని రంగాల పురోభివృద్ధికి మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ పిఒ ఎల్.మోహనరావు మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థినులు సమాజం కోసం చురుగ్గా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎన్ఎస్ఎస్ ఎపిఒ పి.పైడిరాజు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వేణుగోపాల్

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

ప్రజాశక్తి- కొత్తూరు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యా కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు కృషి చేయాలని వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సవర సావిత్రి అధ్యక్షతన పాఠశాలల విద్యా కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు శనివారం శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందుతున్న తీరు, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న బోధనను వారినికొకసారి పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ తిరుమల చైతన్య, ఎంపిడిఒ నీరజ, ఎంఇఒలు సిహెచ్.గోవిందరావు, ఎన్.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు ఎ.గోవిందరావు, శాంతారావు, సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు, టిడిపి నాయకులు కె.సంజీవరావు, ధర్మారావు పాల్గొన్నారు.

మెజారిటీ సభ్యుల తీర్మానంతో ఎన్నిక

ఎపిఎం ప్రసాదరావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో మత్స్యకార గ్రామ సంఘంలో మెజారిటీ సభ్యుల తీర్మానంతో ఎన్నిక నిర్వహించామని వెలుగు ఎపిఎం ప్రసాదరావు తెలిపారు. మండలంలోని డొంకూరులో మత్స్య మహిళా గ్రామ సంఘం సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొత్తం 42 సంఘాలకు 40 సంఘాల సభ్యులు ప్రస్తుతం విఒఎగా పనిచేస్తున్న చొక్కా వరలక్ష్మి పనితీరు సరిగా లేదని ఆరోపణలు, అభియోగాలు చేసి అంతమంది సభ్యులు ఏకాభిప్రాయం మేరకు ఆమెను తొలగించామన్నారు. ఆమె స్థానంలో కొత్త వారిని ఎంపికకు తీర్మానం చేశామన్నారు. సమావేశంలో సిసి లక్ష్మి, విఒఎ సిహెచ్.వరలక్ష్మి, సర్పంచ్ ప్రతినిధి కళ్యాణ్, చీకటి కృష్ణయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

ఫిబ్రవరి 6 నుంచి ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పలాస: జిల్లా కేంద్రంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 6,7,8,9 తేదీల్లో ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చాపర సుందర్ లాల్ తెలిపారు. స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో యువత పాత్ర అత్యంత కీలకమైనదని అన్నారు. యువతరంలో ప్రగతిశీల, అభ్యుదయ భావజాలం, లౌకిక, ప్రజాస్వామిక ఆలోచనలను, నైతిక విలువలను ఎంపొందించడానికి అఖిలభారత యువజన సమాఖ్య కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు వాసుదేవరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాలుగు వార్డుల్లో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి- నరసన్నపేట/పోలాకి

నరసన్నపేట మేజర్ పంచాయతీలో ఐదో వార్డు బండి వీధిలోని ఐదు రోజులుగా తాగునీటి సమస్యలతో అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. పంచాయతీ సిబ్బంది ఈ ప్రాంతానికి వస్తున్న మెయిన్ పైపులైన్‌కు ఒక వాల్వ్‌ను అమర్చి తమకు నచ్చినప్పుడల్లా విడిచిపెట్టడం, మళ్లీ కట్టేస్తున్నారు. పైడితల్లమ్మ ఆలయం వద్ద కొత్తగా నిర్మించబడిన వాటర్ ట్యాంకు ఈ లైన్ కలిపి ఉంది. దీంతో కొన్ని వీధులకు ఎక్కువ మొత్తంలో నీటి సరఫరా అవుతుంది. ఈ వార్డు పరిధిలోని ఈ నాలుగు వీధులకు నాలుగు నెలలుగా అధికారులకు నచ్చిన విధంగా తాగునీటిని విడిచి పెడుతున్నారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారయ్యారు.

ఖోఖో పోటీలను నిర్వహిస్తున్న సభ్యులు

ఉత్సాహంగా ఖోఖో పోటీలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక రోటరీ క్లబ్ న్యూ జనరేషన్ మంత్ సందర్భంగా శనివారం సురంగి రాజా క్రీడా మైదానంలో ఖోఖో పోటీలు నిర్వహించారు. ఏడు బృందాలుగా బాలికలు, బాలురు విభాగంలో పోటీపడ్డారు. ఈ పోటీలకు ఇచ్ఛాపురానికి చెందిన పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పోటీ పడ్డారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధులు పి.దినేష్‌కుమార్, కె.రామారావు, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, ఎం.నవీన్‌కుమార్, రామకోటి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ ఉమామహేశ్వరరావు

పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని పెద్దలక్ష్మీపురం పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ అన్నెపు ఉమామహేశ్వరరావు కోరారు. ఈనెల 12న పంచాయతీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించామని తెలిపారు. ఈ మేరకు అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావును శనివారం వినతిపత్రం అందజేశామన్నారు. ఎస్‌సిలకు ఇళ్ల పట్టాలు, పోడు భూములు పట్టాలు ఇప్పించాలన్నారు. సిసి రోడ్లు రోడ్లు, డ్రెయినేజీని నిర్మించాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బైరాగినాయుడు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న ట్రస్టు సభ్యులు

'ఆ నలుగురు' ట్రస్టుకు అవార్డు

ప్రజాశక్తి- పలాస

విశాఖ రత్న ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆ నలుగురు ట్రస్టుకు జాతీయ తెలుగు వెలుగు రత్న అవార్డుకు ఎంపికైందని వ్యవస్థాపకులు పిచ్చుక పాపారావు తెలిపారు. జిల్లాలోనే కాకుండా మరెన్నో ప్రాంతాల్లో సరైన సమయానికి రక్తదాతలను అందిస్తూ... మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆ నలుగురు ట్రస్టుకు విశాఖ రత్న ఆధ్వర్యాన 2024 అవార్డును శనివారం అందజేశారని తెలిపారు. అనంతరం ట్రస్టు సభ్యులు సానా ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావులకు దుశ్శాలువ కప్పి సన్మానించరాని తెలిపారు.

భూసార పత్రాలను అందజేస్తున్న హరివరప్రసాద్

భూసారం బట్టి ఎరువుల వాడకం

కోటబొమ్మాళి: ప్రభుత్వం రైతుల పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలు ఆధారంగా రైతులు ఎరువులు వాడుకొని అధిక దిగుబడులు పొందాలని పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ అన్నారు. మండలంలోని నిమ్మాడ రైతు సేవా కేంద్రంలో టెక్కలి వ్యవసాయ సంచాలకులు బి.వి.తిరుమలరావు అధ్యక్షతన రైతులకు భూసార పరీక్ష ఫలితాల పత్రాలను రైతులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో మండల ఎఒ ఎస్.గోవిందరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్.శివకుమార్ పాల్గొన్నారు.

మహిళలపై టిడిపి నాయకుల దాడి

చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని మంచినీళ్లపేటలో టిడిపి నాయకులు మహిళలపై దాడి చేశారు. ఇద్దరి మహిళలు, మరో యువకుడిని చితకబాదడంతో తీవ్ర గాయాలపాలైన బాదితులు పలాస ప్రభుతాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామం కమిటీ సమావేశాన్ని ఉదయం 8 గంటలకు నిర్వహించారు. 11 గంటల సమయంలో వైసిపి కార్యకర్త గూడేం చిన్నారావును సమావేశానికి రావాలని టిడిపి నాయకులు గుళ్ల చినారావు, మాణిక్యాలరావు, మడ్డు అప్పలస్వామి, మడ్డు రాజు, కారి లింగరాజు పిలిచారు. దీంతో ఆ సమావేశానికి చిన్నారావుతో పాటు ఆయన మేనత్తలు రట్టి లక్ష్మమ్మ, కదిరి నీలమ్మలు వెళ్లారు. నాలుగేళ్ల కిందట మంచినీళ్లపేట జెట్టి నిర్మాణంలో 66 మందికి చెందిన రూ.1.63 లక్షలు కూలీ డబ్బుల ఎందుకు చెల్లించలేదని గూడేం చిన్నారావును టిడిపి నాయకులు, మరో 20 మంది నిలదీశారు. దీనికి చిన్నారావు తనకు సంబంధం లేదని, జెట్టీ కాంట్రాక్టర్‌ను అడగాలని సమావేశంలో పెద్దలకు చెప్పారు. దీంతో కోపోద్రిక్తులై దాడి చేయడంతో గాయపడ్డారు. ఎస్ఐ కె. నిహార్‌ను వివరణ కోరగా పలాస ప్రభుత్వాస్పత్రికి వెళ్లి ఇరు గ్రూపుల నుంచి వాంగ్మూలం తీసుకున్నామని, వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. మండల ప్రత్యేకాధికారి ఉదయ్‌కుమార్ క్షతగాత్రులను పరామర్శించారు.